ChimataMusic.com
Patha Patala Parnasala

# దేవులపల్లి గీతం - చీకటి వెలుగుల కౌగిటలో...

*by* శాంతారాం

(Listen to this wonderful song - http://chimatamusic.com/playcmd.php?plist=3587)

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాను. ఒక శుభదినాన నందకిషోర్ గారు ఈ సూత్రాన్ని ఆరంభిస్తారేమోనని ('DB' లో నందకిషోర్ ను ప్రారంభించమని శ్రీనివాస్ అడిగినట్లుగా గుర్తు). ఎదురు చూసిన రోజు రానేలేదు. తెగించి నేనే ప్రారంభిస్తున్నాను. "తెగించి" అనడానికి కొన్ని కారణాలున్నాయి.

దేవులపల్లి వారి గీతాలను విశ్లేషించే ప్రజ్ఞ లేదని తెలిసీ ఆ దుస్సాహసానికి పూనుకోవడం మొదటిది. "రవి కానని చో కవి గాంచునెయ్యెడన్" అని కదా పెద్దల ఉవాచ. అలాంటి ఒక కవియొక్క, అందునా దేవులపల్లి వారి భావాలను ఆకళింపు చేసుకొనే పరిజ్ఞానం లేదని తెలిసీ ఆ ప్రయత్నం చేయడం.

ఒకవేళ అంతో ఇంతో అర్థం చేసుకొని వ్రాసినా అపార పరిజ్ఞానం కలిగిన శ్రోతలను/పాఠకులను మెప్పించగలనా అనే సంశయం రెండవది. ఈ మిడతంభొట్లు పాండిత్యాన్ని ఎంతవరకు హర్షిస్తారనే సంకోచం.

ఇవన్నీ పక్కనబెట్టి ఈ వ్యాఖ్య వ్రాశాను (వ్రాసేవాడికి చదివేవాడు లోకువ కదా :) ). ఇది నాకు స్ఫురించిన భావం. కవి భావం వేరయి ఉండవచ్చు. ఏదైనా ఎవరినైనా కించపరిచేదిగా అనిపిస్తే అది ఉద్దేశపూర్వకం, దురుద్దేశపూరితం కాదని మనవి.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి - ఈ పేరు వినగానే తెలుగువారి గుండెల్లో మృదుమధుర భావగీతాల శతకోటి వీణలు. సామాన్యజనాన్ని సైతం ఓలలాడించిన ఈతని భావకవిత్వపు సంద్రంలో మునకవెయ్యని వారెవ్వరు!! రాయప్రోలు, అబ్బూరి భావకవితోద్యమాన్ని ప్రారంభించి ఉండవచ్చు కాక, ఈ శాఖలో అగ్రతాంబూలం మాత్రం దేవులపల్లి వారిదే. భావకవిత్వపు సామ్రాజ్యానికి నాటికీ, నేటికీ తిరుగులేని రారాజు.

1950వ దశకంలో "మల్లీశ్వరి" చిత్రంతో చలనచిత్ర రంగప్రవేశం చేసి నభూతో నభవిష్యత్ అన్న చందాన ఎన్నో ఆణిముత్యాల్లాంటి పాటలను తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఏ ఏ చిత్రాలలో ఏ ఏ పాటలు వ్రాశారు అన్న విషయాన్ని కాస్త పక్కనపెట్టి వీరి పాటల్లో ఒక పాటని కొంత విశ్లేషించి చుద్దామా !

"చీకటివెలుగులు" చిత్రంలోని "చీకటివెలుగుల కౌగిటిలో" అన్న పాట నాకే కాదు ఎందరికో ఇష్టమైన పాట. ప్రతీకాత్మకతకి పరాకాష్టగా నిలిచే అద్భుతమైన పాట. పైకి చూస్తే ప్రకృతి వర్ణనా గీతంగా కనిపించినా అంతర్గతంగా ప్రకృతితో ఆపాదిస్తూ ప్రకృతిపురుషుల (స్త్రీపురుషుల) ప్రేమానుబంధానికి నిర్వచనం చెప్పే పాట. మొదటి రెండు చరణాలు ఈ బంధం ఎలా ఉండాలో చెపితే ఆఖరి చరణం ఎలా ఉండకూడదో చెపుతుంది. అంతేకాక ఈ పాట పల్లవి ఎంతో అర్థవంతంగా ఉంటుంది. పల్లవిలోని పదప్రయోగం అనన్యం.

ముందుగా పల్లవిలోని మొదటి రెండు వాక్యాలు.

"చీకటివెలుగుల కౌగిటిలో చిందే కుంకుమ వన్నెలు

ఏకమైన హృదయాలలో పొంగే బంగరు రంగులు"

ఈ రెండు వాక్యాలలోని మూడు పదప్రయోగాలు - "చీకటివెలుగుల కౌగిటిలో", "కుంకుమ వన్నెలు", "బంగరు రంగులు" - వీటికున్న విశేషాన్ని పరిశీలిద్దాం.

"చీకటివెలుగులు" అనగానే మనకు స్ఫురించేది పరస్పర విరుద్ధ భావనలు (కలిమిలేములు, ఆశనిరాశలు, సుఖదుఃఖాలు మొదలైన వాటిలాగా). ఈ పదబంధంలో ప్రణయ భావన ఏ కోశానా కనిపించదు. కానీ దీనికి "కౌగిటిలో" అన్న పదాన్ని జోడించగానే పరస్పర విరుద్ధ భావం పలాయనం చిత్తగించి ఆ స్థానంలో ప్రణయ భావం చోటు చేసుకుంటుంది. వినేవారికి "చీకటివెలుగుల కౌగిటిలో" అనే ప్రయోగంలో కేవలం ప్రేమైక భావన మాత్రమే తడుతుంది. "కౌగిటిలో" అన్న పదాన్ని ప్రయోగించి మొదటి పదమైన "చీకటివెలుగులు"కి ఉన్న నిజార్థాన్ని పూర్తిగా మరుగుపరచి శ్రోతల మదిలో ఒక భిన్న భావాన్ని కలిగించడమనేది అద్భుతం.

"చీకటివెలుగులు" కౌగిలించుకునే సమయాలు ప్రాతఃకాలం, సంధ్యా సమయం ... అటు పగలు, ఇటు చీకటి కాని సందిగ్ధ సమయాలు ... . "చీకటివెలుగుల కౌగిటిలో" అనడం ద్వారా ఈ రెండు సమయాలని ఏక కాలంలో స్ఫురింపచేయడం, ""చీకటివెలుగుల కౌగిటిలో చిందే కుంకుమ వన్నెలు" అనడం ద్వారా ప్రాతః కాలంలోనూ, సంధ్యా సమయంలోనూ ఆకాశంలో చిందే అరుణవర్ణాలని దృగ్గోచరింపచేయడం దేవులపల్లి వారి రచనా చమత్కారం. ఇది ప్రకృతి పరంగా. మరి దీన్నే ప్రణయ పరంగా చూస్తే? ప్రణయంలో ఎరుపెక్కటాన్ని సిగ్గుకి ప్రతీకగా చూస్తే కౌగిలిలో చిందే సిగ్గుదొంతరలు, ఆ సిగ్గుతో ఎరుపెక్కటమూ కనిపిస్తాయి.

ఎరుపు వర్ణాన్ని సూచించడానికి వివిధ పదాలు ఉండగా "కుంకుమ" పదాన్ని ప్రయోగించారు. అలాగే "బంగరు" పదప్రయోగం కూడా ప్రత్యేకమైనది. "బంగరు" శుభప్రదమైన పసుపు వర్ణాన్ని సూచించడమే కాకుండా అమూల్యతనీ, విలువనీ, తరగని ప్రకాశతనీ తెలుపుతుంది. మన సాంప్రదాయంలో పసుపు కుంకుమలకీ, పుత్తడికీ విశిష్ట స్థానం ఉంది. పవిత్రతకీ, సౌభాగ్యానికీ, అమూల్యతకీ, శుభత్వానికీ, విలువకీ, ఔన్నత్యానికీ ప్రతీకలివి. ఇవి లేని పుణ్యకార్యం లేదు. ఈ పదాలని వాడటం ద్వారా స్త్రీపురుష అనుబంధానికి పవిత్రతని, పుణ్యత్వాన్ని ఆపాదించటమే కాక ఆ ప్రేమకున్న విలువని, ఔన్నత్యాన్ని, అమూల్యతని, వసివాడనితనాన్ని తెలియపరిచారు దేవులపల్లి వారు.

ఇంకొంత లోతుగా చూస్తే కథాపరంగా కూడా కొన్ని అర్థాలు కనబడతాయి (ఈ సినిమా నేను చూడలేదు. ఈ అర్థాలు నా ఊహలు మాత్రమే. కథతో సరిపోలితే అంతకన్నా కావలసిందేముంది? :) ). చీకటివెలుగుల కౌగిటిని పగలు, చీకటి కాని సందిగ్ధతకి ప్రతీకగా చూస్తే చిత్రంలోని పాత్రధారుల ప్రేమలో ఉన్న గెలుపు ఓటముల సందిగ్ధత కనిపిస్తుంది. అలాగే చీకటివెలుగులకున్న పరస్పర విరుద్ధార్థాన్ని పరిగణించి ఎరుపుని సంఘర్షణకి, విప్లవానికి, అభ్యుదయానికి ప్రతీకలుగా తీసుకుంటే విరుద్ధ ఆర్థిక, సామాజిక వ్యవస్థలకి ప్రాతినిధ్యం వహించే స్త్రీపురుషుల మధ్య ప్రేమ, ఆ ప్రేమలోని సంఘర్షణ, విప్లవం, దాని ద్వారా ఆశించిన అభ్యుదయం కనిపిస్తాయి.)

"ఈ మెడ చుట్టూ గులాబీలూ

ఈ సిగపాయల మందారాలూ"

ఆహా!! ఒకరి ఒడిలో ఒకరు ఒదిగున్నారని ఎంత చక్కగా చెప్పారు దేవులపల్లి వారు!! ఆలింగనాన్ని, శారీరక సామీప్యాన్ని, సాన్నిహిత్యాన్ని సూచించే పదాలేవీ వాడకుండా ఒకరి కౌగిలిలో ఇంకొకరు ఇమిడి ఉండటాన్ని అద్భుతంగా వర్ణించారు. పురుషుడి మెడలోని పూలు స్త్రీ సిగపాయలలో పూలుగా కనిపించడమనేది వారిద్దరూ శారీరకంగా ఎంతో సామీప్యంగా ఉన్నప్పుడే సాధ్యం. ఈ శారీరక సామీప్యమే కౌగిలి. ఇక్కడ వాడిన ఏకాక్షర పదం "ఈ" దీనినే బలపరుస్తుంది. "ఈ" ని సామీప్యంలో ఉన్నవాటిని సూచించటానికి వాడతారు. "ఈ మెడ", "ఈ సిగపాయలు" అనడం ద్వారా వాటి మధ్యనున్న అతి సామీప్యాన్ని చూపించారు. అలాగే "ఈ" ఏకాక్షర పదాన్ని స్త్రీపురుషులనిరువురినీ సూచించడానికి ప్రయోగించడం ద్వారా కౌగిలిలో ఏకమైన ఇద్దరిని సూచిస్తున్నారు. (ఈ వాక్యాలకు ఇంకో రెండు అర్థాలున్నాయి. మొదటిది ఈ వాక్యాలకున్న అర్థాన్ని యధాతథంగా తీసుకుంటే "స్త్రీ మెడలోని పూలు ఆమె సిగపాయలలో పూలుగా కనపడుతున్నాయి" అనే భావం వస్తుంది. ఇందులో స్త్రీపురుషుల ప్రేమానుబంధాన్ని వర్ణించే అంశం ఏమి కనపడదు. కేవలం స్త్రీ అలంకార వర్ణనలా తోస్తుంది. ఈ అర్థం మిగతా గీతభావనతో సరిపోలడం లేదని నా భావన. రెండవది స్త్రీ సిగపాయలలోని పూలు పురుషుడి మెడ చుట్టూ పూలుగా కనిపించడం. కానీ విరులలోని పూలు మెడచుట్టూ అల్లుకోవడం అనేది కొంత విడ్డూరంగా తోస్తుంది.)

అలాగే ఈ వర్ణనలో కొంత నాటకీయత కూడా కనిపిస్తుది. ఈ వర్ణన విన్నవారికి పురుషుని మెడలో పూలు, ఆ పురుషుడిని కౌగిలించుకొని ఉన్న స్త్రీ, ఆ కౌగిలింతలో విడివడిన స్త్రీ సిగపాయలు, అవి పురుషుడి వక్షస్థలం మీద పరుచుకొని ఉండటం, అలా పరుచుకోవటం వల్ల అతని మెడలోని పూలు ఆమె సిగపాయలలో పూలుగా కనిపించడం ... ఇవన్నీ కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తాయి.

పల్లవి ప్రకృతిపురుషుల ప్రేమానుబంధం గొప్పతనాన్ని చాటితే చరణాలు ఆ ప్రేమానుబంధాన్ని నిర్వచిస్తాయి.

**"తేట నీటి ఈ ఏటి ఒడ్డున నాటిన పువ్వుల తోట**

**నిండు కడవల నీరు పోసి**

**గుండెల వలపులు కుమ్మరించి**

**ప్రతి తీగకు చేయూతనిచ్చి**

**ప్రతి మానూ పులకింపచేసి**

**మనమే పెంచినదీ తోట**

**మరి ఎన్నడు వాడనిదీ తోట**

**మరచిపోకుమా తోటమాలి**

**పొరబడి అయినా మతిమాలి"**

స్వచ్ఛమైన తలపులతో కూడిన మానససరోవరం ఒడ్డున నాటిన నానావిధ పరిమళభరిత పూదోట స్త్రీపురుషుల ప్రేమ. నిండుమనసులలోని ప్రేమనే నీరు పోసి, గుండెల్లోని వలపులను కుమ్మరించి, ప్రతి (చిన్నా పెద్ద) తలపును ఆస్వాదిస్తూ ప్రేమికులు పెంచుకునే అందమైన పూదోట ప్రేమ. ఇటువంటి ప్రేమ ఎన్నడూ వాడనిది. ఈ ప్రేమను పొరబాటున కూడా అశ్రద్ధ చేయరాదు. ఇక్కడ ప్రేమను పువ్వుల తోటతో పోలుస్తూ ఆ

తోటను ఏవిధంగా పెంపొందించి సంరక్షించుకోవాలో తెలియచేశారు. ఈ పూలతోట పెంపునకు కావలసింది అంతఃసౌందర్యము, కల్మషం లేని మనసులు, మనస్ఫూర్తిగా ప్రేమించగలిగిన హృదయాలే కాని బాహ్యసౌందర్యము, సిరిసంపదలు కావు.

ఇక్కడ "తేటనీటి ఏటి ఒడ్డు" - స్వచ్ఛమైన తలపులతో కూడిన మనసుకి

"నిండు కడవల నీరు" - నిండు మనసులలోని ప్రేమకి

"ప్రతి తీగ, ప్రతి మాను" - ప్రేమలో ఉదయించే ప్రతి చిన్నాపెద్ద తలపులకి, అనుభూతులకి ప్రతీకలు. తీగ చిన్న అనుభూతికి, మాను పెద్ద అనుభూతికి చిహ్నాలు.

పూలు, పూలతోట అనగానే మనకు స్ఫురించేది సున్నితత్వము, పరిమళము, ఆహ్లాదత్వము, ఇంపుగొలిపే వివిధ వర్ణాలు. పూలతోటతో పోల్చటం ద్వారా ఈ లక్షణాలన్నింటినీ ప్రేమకు ఆపాదించారు.

**"ఆరు ఋతువులు ఆమని వేళలే మన తోటలో**

**అన్ని రాత్రులు పున్నమి రాత్రులే మన మనసులో**

**మల్లెలతో వసంతం**

**చేమంతులతో హేమంతం**

**వెన్నెల పారిజాతాలు**

**వానకారు సంపెంగలు**

**అన్ని మనకు చుట్టాలేలే**

**వచ్చీపోయే అతిథులే"**

"మనసున మనసై, బ్రతుకున బ్రతుకై" ఒకరికి ఒకరు తోడుగా నిలిచే నిజమైన ప్రేమలో ఎటువంటి కాలాలైనా హాయిగొలిపే ఆమని కాలాలు, పున్నమి రాత్రులు. మనలని ప్రేమిస్తూ మన అవేదనలో, వ్యధలలో పాలుపంచుకొనే జీవిత సహచరిణి/సహచరుని సాన్నిధ్యంలో నిప్పులు చెరిగే గ్రీష్మమైనా, మోడువారిన శిశిరమైనా ఆమని వేళలల్లే తోస్తాయి. కటిక చీకట్లు కూడా పున్నమి రాత్రులే.

ఆరు ఋతువులు, అన్ని రాత్రులు జీవితంలో మారే స్థితిగతులకి ప్రతీకలు కాగా ఆయా ఋతువులలో మాత్రమే పుష్పించి రాలిపోయే పుష్పాలు (మల్లెలు, చేమంతులు, పారిజాతాలు, సంపెంగలు) ఆ స్థితిగతుల అశాశ్వతకి ప్రతీకలు. అలాగే ఋతువులతోను, రాత్రులతోను పోల్చడం ద్వారా జీవితంలో ఆయా స్థితిగతుల 'cyclicity' ని గుర్తుకు తెప్పిస్తారు.

ఇక్కడ చుట్టరికానికి, అతిథికి ఉన్న తేడాని కూడా చక్కగా వర్ణించారు. చుట్టరికమనేది జీవితాంతం ఉంటుంది. కాని అతిథులు అడపాదడపా వచ్చిపోతుంటారు. సుఖదుఖాలు, కలిమిలేములు, నిరాశానిస్పృహలు, మొదలైన స్థితిగతులతో మనిషి జీవితానికున్న అనుబంధం

చుట్టరికం. కాని ఇవి జీవితంలో ఎల్లవేళలా ఉండవు. వచ్చిపోయే అతిథులివి. జీవితంలో ఏ క్షణంలోనైనా, ఏ దశలోనైనా - బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం - తాత్కాలికంగా రావచ్చు, పోవచ్చు.

పరోక్షంగా చూస్తే జీవితంలో ఏదీ శాశ్వతం కాదు, అన్నింటినీ సమానంగా తీసుకోవాలనే సందేశాలు కనిపిస్తాయి.

**"గలగల మనకూడదూ ఆకులలో గాలి**

**జలజల మనరాదు అలలతో కొండవాగు**

**నిదరోయె కొలను నీరు కదపకూడదూ**

**ఒదిగుండే పూలతీగ ఊపరాదూ**

**కొమ్మ పైనిట జంట పూలు**

**గూటిలో ఇట రెండు గువ్వలు"**

ఈ చరణంలో స్త్రీపురుషానుబంధంలో ఉండకూడని లక్షణాలు వివరించారు. తమ అనుబంధంలో కలతలకి, కలహాలకి, మనస్పర్థలకి తావివ్వక, స్త్రీపురుషులు ఒకరిపై ఒకరు ఆధిక్యాన్ని ప్రదర్శించక అన్యోన్యంగా ఉండాలి.

ఇక్కడ ఇమిడి ఉన్న "ఆకులలో గాలి", ఒద్దికగా "ఒదిగుండే పూలతీగ" స్త్రీకి ప్రతీకలు.

వివిధ ప్రదేశాలు తిరుగాడే "అలలతో కొండవాగు", గంభీరమైన "నిదరోయె కొలను" పురుషుడికి ప్రతీకలు.

"గలగలమనటం, జలజలమనటం, నీరు కదపటం, ఊపటం" కలహాలకి, మనస్పర్థలకి, అలజడులకి ప్రతీకలు.

నాడు క్షీరసాగర మథనంలో వెలువడింది అమృతమయితే దేవులపల్లివారి కలం నుండి వెలువడింది గీతామృతం. అమృతం గ్రోలినవారు అమరులయితే ఈ గీతామృతాన్ని గ్రోలిన మనమూ (తెలుగు వారము) అమరులమే!!

**రచయిత పరిచయం:**

తల్లితండ్రులు ఇచ్చిన పేరు : శాంతారామ్ మడక.
ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితులు, తెలిసిన వారు ఇచ్చిన పేరు : పాటల పిచ్చోడు.

జీవన ప్రస్థానంలో మొదటి మజిలీ కడప జిల్లా వేపరాల గ్రామం. ప్రస్తుత మజిలీ బెంగుళూరు. నాన్నగారు ప్రభుత్వోద్యోగి అవ్వడం వల్ల ఎన్నో మజిలీలు. పాతచోటులో పెంచుకున్న అనుబంధాలని వదిలి కొత్త ప్రదేశంలో నూతన అనుబంధాలకై అన్వేషణ జీవితంలో భాగమై పోయింది.

వృత్తి రీత్యా ఒక Software Engineer ని.
ప్రవృత్తి రీత్యా ఒక కళాస్వాదకుడిని, ప్రకృతి ఆరాధకుడిని, సమాజ సేవకుడిని.

జీవన భృతి కోసం code వ్రాస్తుంటాను. మనోతృప్తి కోసం అడపాదడపా ఇలాంటివి వ్రాస్తుంటాను. :)

పాటల్లో బాణీలోనూ, సాహిత్యంలోనూ, పదప్రయోగంలోనూ నూతనత్వాన్ని ఆస్వాదించడానికి ఇష్టపడే నాకు ఇవి పుష్కలంగా లభించే పాతపాటలంటే అభిమానం. వీటితో పాటు చిన్ననాటి అనుభూతులు కూడా పెనవేసుకుపోవడం వల్ల అనుకుంటా 70s, 80s పాటలంటే వల్లమాలిన అభిమానం. ఇదే కాలంలో తెలుగు పాటల మధురిమకి కొత్త అర్థాన్నిచ్చిన సంగీత (త్రి)మూర్తులంటే (MSR - Mahadevan, Satyam, Ramesh Naidu - చూశారా! నా పేరులోని initials లో ఈ త్రిమూర్తులను ఇముడ్చుకున్నాను) అమితమైన ఆరాధన.

మాధుర్యం, సాంద్రత, ఉచ్చారణా స్వచ్ఛత ఉన్న ఏ గొంతునైనా ఇష్టపడతాను. బాలు, ఘంటసాల, రఫీ, కిషోర్ కుమార్, సుశీల, జానకి, లత, ఆశాలతో పాటు పిఠాపురం, మాధవపెద్ది, రామకృష్ణ, ఆనంద్, జిక్కి, లీల, LR ఈశ్వరి మొదలైన వారందరూ ఇష్టమైన గాయకులే.

నాయికా నాయకులకన్నా సహాయనటులపై (character artists), హాస్యనటులపై అభిమానం మెండు. కన్నాంబ గారి నుండి కోటా దాకా, శివరావు నుండి బ్రహ్మీ (The Software Engineer) దాకా ఇష్టమైన నటులెందరో. ముఖ్యంగా కన్నాంబ, SVR, సత్యనారాయణ, గుమ్మడి, చంద్ర మోహన్, రాజబాబు, ఆలీ, శ్రీలక్ష్మి, బ్రహ్మానందం మొదలైనవారంటే చాలా ఇష్టం.

అష్టాదశ పురాణాలు మొదలుకొని నన్నయ, తిక్కన, పెద్దన, శ్రీనాథుడి రచనలు, శతక మంజరులు, కృష్ణశాస్త్రి, తిలక్, శ్రీశ్రీ, చలం రచనలు, శంకరమంచి సత్యం, మధురాంతక రాజారాం, మల్లాది రామకృష్ణ శాస్త్రి కథలు, చిన్నప్పుడు చదివిన పెద్ద బాలశిక్ష, పిల్లల గేయాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు వీటిపై ఉన్న ఆసక్తి నవలలపై లేదు. నాకు నచ్చిన నవలలు అతి తక్కువ. అతడు అడవిని జయించాడు, అరణ్య కాండ లాంటి నవలలని ఇష్టపడతాను.ప్రాచీన కళలంటే ప్రాణం.

ఒక్కో పాట వింటూ చిన్ననాటి స్మృతులు నెమరువేసుకోవడం ప్రియమైన వాటిలో ఒకటి. చిన్నతనంలో తపాలాబిళ్ళల సేకరణతో మొదలైన హాబీలు నేడు పాటలు, తెలుగు సాహిత్యం, ప్రాచీన వస్తువులు, చిత్రలేఖనాలు సేకరించేంతగా విస్తారమయ్యాయి.